పటిష్టంగా సెక్యూరిటీ ఉండాలి



వైద్య కళాశాలలు, ఆస్పత్రుల్లో భద్రతను పటిష్టం చేయాలి. రాత్రి వేళల్లో సైతం వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది రోగులకు సేవలు అందించేందుకు విధులు నిర్వహిస్తుంటారు. అలాంటి వారికి భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది. కోల్‌కత్తా లాంటి ఘటనలు జరగకుండా ఆస్పత్రిలో 24 గంటలూ సెక్యూరిటీ పటిష్టంగా ఏర్పాటు చేయాలి. మద్యం, మత్తు సేవించిన వారిని ఆస్పత్రిలోనికి రాకుండా నిరోధించాలి.

–డాక్టర్ శ్రావణి, మెడికల్ ఆఫీసర్



ప్రాణాలు కాపాడే వారిపైనే దాడులా

జబ్బు చేసి ఆస్పత్రికి వచ్చిన వారి ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. అలాంటి వారిపై దాడులకు పాల్పడటం అంటే ప్రాణదాతలపై దాడులు చేయడమే. కోల్‌కత్తాలో జరిగిన ఘటన దేశ వ్యాప్తంగా కలకలం రేపింది. వైద్యులు, వైద్య విద్యార్థులు, వైద్య సిబ్బంది భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి.

–సాంబశివరావు, హెల్త్ సూపర్‌వైజర్



క్లుప్తంగా

సుఖశాంతులతో వర్ధిల్లాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలో సుఖ శాంతులు వర్ధిల్లాలంటే వలి అల్లా మహాత్ముల చల్లని దీవెనలు అవసరమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. పాతబస్తీ పంజా సెంటర్‌లోని సుప్రసిద్ధ హజరత్ సయ్యద్ షా మస్తాన్ వలి రెహమతుల్ ఆలై లోటే సోటె వాలే బాబా 103వ ఉరుసు మహోత్సవంలో భాగంగా దర్గాను ఆసిఫ్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పాతబస్తీ పంజా సెంటర్‌లో వేంచేసియున్న హజరత్ సయ్యద్ షా మస్తాన్ వలి రెహమతుల్ ఆలై లోటే సోటె వాలే బాబా అనేక అద్భుతాలు ఆవిష్కరిస్తూ అందరి కోర్కెలను అల్లాహ్ అనుగ్రహంతో నెరవేరుస్తున్నారని తెలిపారు. తరాలు మారినా అయన అభిమానుల సంఖ్య పెరుగుతూనే ఉంటుందన్నారు. తల రాతలు మార్చే బాబాగా పేరొందిన అయన దర్గాకు వస్తే అన్ని శుభాలే జరుగుతాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నేత బాషీ దర్గా ముజావర్లు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

తెలివైన వారే సైబర్ నేరాలకు బలి

పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు

విజయవాడస్పోర్ట్స్: ఎంతటి తెలివైన వారినైనా బురిడి కొట్టించగల మేథోశక్తితో సైబర్ నేరగాళ్లు ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు సూచించారు. బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ), ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు బీబీఏ సమావేశపు మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ ఉన్నతాధికారులు, రాజకీయ ప్రముఖులను సైతం మోసం చేసే స్థాయి సైబర్ నేరగాళ్లు చేరుకున్నారని తెలిపారు. అత్యాశకు పోయిన వ్యక్తులే అత్యధికంగా సైబర్ నేరగాళ్లకు చిక్కుతున్నారన్నారు. చేతిలోని మొబైల్‌ను చాలా జాగ్రత్తగా వినియోగించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. బీబీఏ అధ్యక్ష కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరామప్రసాద్ (రాజా) అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీఐలు కోమాకుల శివాజీ, గుణరామ్, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్‌కుమార్, సుంకర రాజేంద్రప్రసాద్, సురాబత్తుల దుర్గా మల్లేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం సీపీ రాజశేఖరబాబును బీబీఏ ప్రతినిధులు శాలువాలతో సత్కరించి లక్ష్మీదేవి పటాన్ని బహూకరించారు.

నూతన ఆవిష్కరణలతో మానవ వికాసం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నూతన ఆవిష్కరణల ద్వారా మానవ వికాసం సాధ్యమని ఆ దిశగా విద్యార్థులు కృషి చేయాలని ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో హాక్‌థాన్ - 1.0 పేరుతో రెండు రోజుల పాటు హ్యాకింగ్‌పై జాతీయ స్థాయి పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఐఐటీ ఖరగ్‌పూర్, అన్నా విశ్వవిద్యాలయం (తమిళనాడు)తో పాటుగా దేశం నలుమూలల నుంచి 500 మంది డేటా సైన్స్ విద్యార్థులు హాజరయ్యారు. అన్ని ఐఐటీ సంస్థల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నూతన సాంకేతిక విప్లవం మానవ కల్యాణానికి తోడుగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు నూతన సాంకేతిక రంగంలో అద్భుతాలు చేస్తున్నారని పేర్కొన్నారు. సమాజంలో మహిళలు, దేశ భద్రత, వంటి అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. కృత్రిమ మేధస్సును సమాజానికి మేలు చేసేందుకు వినియోగించుకోవాలని కోరారు. ఆ దిశగా కొత్త ఆవిష్కరణలను తీసుకురావాలన్నారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు వారివారి రంగాల్లో రాణించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సహాయ కార్యదర్శి గ్రంధి పవన్‌కుమార్, కోశాధికారి కాజా రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ పతాంజలిశాస్త్రి, విభాగాధిపతి డాక్టర్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వాగ్గేయ కీర్తనలు



విజయవాడ కల్చరల్: లయ నాద కళా స్రవంతి ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు లంకా వెంకటేశ్వర్లు సంస్మరణోత్సవాలు సందర్భంగా శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీత కార్యక్రమాలు శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటుతున్నాయి. శుక్రవారం నాటి కార్యక్రమంలో కేవీ కిషోర్, సంగీత విద్వాంసురాలు కుందుర్తి మాధవి, ఎం.కీర్తన వాగ్గేయకార కీర్తనలు మధురంగా ఆలపించారు. పి.జయతి, అరవింద్, కార్తికేయ ఆదినారాయణ వాద్య సహకారం అందించారు. సంగీత కళాకారులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

కనకదుర్గమ్మా.. కరుణించమ్మా..







ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మను దర్శించుకునేందుకు జోరు వానలోనూ పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శ్రావణమాసం నాల్గో శుక్రవారం నేపథ్యంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కనకదుర్గమ్మా... కరుణించమ్మా అంటూ అమ్మవారిని పూజించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి

స్థాయీ సంఘ సమావేశంలో మేయర్ భాగ్యలక్ష్మి



స్థాయీ సంఘం సమావేశంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు తాము కృషి చేస్తున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో మేయర్ అధ్యక్షత స్థాయీ సంఘం సమావేశం శుక్రవారం నిర్వహించారు. 21 అంశాలు ప్రతిపాదన రాగా అందులో 14 ఆమోదిస్తూ తీర్మానించారు. నాలుగు అంశాలు వాయిదా వేయగా, ఒక అంశాన్ని రికార్డు, ఒక అంశాన్ని ధ్రువీకరించారు. ఒక అంశాన్ని తర్వాత జరిగే సమావేశంలో పూర్తి వివరాలతో పొందుపరచాలని నిర్ణయించారు.

ప్రధానాంశాలు....

- సింగ్‌నగర్ నందమూరి నగర్‌లో నిర్మించిన వాటర్‌ట్యాంకు ప్రాంగణానికి ప్రహరీ నిర్మించాలని అందుకు అయ్యే రూ. 33 లక్షలు కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నుంచి వెచ్చించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదం తెలుపుతూ తీర్మానం చేశారు.
- కెనాల్ రోడ్డు పార్కింగ్ ప్రదేశాన్ని ఏడాదిపాటు లీజుకు సీల్డ్ టెండర్లు పిలవగా మైలవరపు దీపక్ కుమార్ అధిక మొత్తంలో రూ.32లక్షలకు టెండరు దక్కించుకున్నారని దీన్ని ఆమోదించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదం తెలిపారు.
- లబ్బీపేట బృందావన కాలనీలోని వీఎంసీ ఇంజినీర్ బంగ్లాను అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫీస్‌కు లీజుకు ఇవ్వాలని, ఇందుకు నెలకు రూ. 23 వేల నెలవారీ అద్దె చెల్లించేలా వచ్చిన ప్రతిపాదనను స్థాయీ సంఘం ఆమోదిస్తూ తీర్మానం చేసింది
- సర్కిల్-3 పరిధిలోని రాణిగారితోటలో ఉన్న రివర్ ఫ్రంట్ పార్కుకు, అజిత్‌సింగ్ నగర్ ఆర్‌ఆర్‌ఆర్ (రీసైకిల్, రీయూస్, రెడ్యూస్) పార్కుల ప్రవేశ రుసుం పెద్దలకు రూ. 20, చిన్నారులకు రూ.10, వాహనాల పార్కింగ్‌లో కారుకు రూ. 50, ద్విచక్ర వాహనానికి రూ. 20, కెమెరాకు రూ. 20, వీడియోకు రూ. 100, టీవీ సీరియల్ షూటింగ్‌కు ఒక్క రోజుకు రూ. 5 వేలు, వీడియో షూటింగ్ పెళ్లి, పుట్టినరోజు వేడుకలకు రూ. 1000, సినిమా షూటింగ్ రూ.10 వేలుగా నిర్ధారించారు. స్కూల్ పిల్లలకు 50 శాతం కన్సెక్షన్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఒక్కక్కరికి రూ. 75 శాతం కన్సెక్షన్ ఇచ్చేలా వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదం తెలిపారు. అలాగే వాకర్స్‌కు, యోగా చేసేకునేవారికి ఉదయం 5.30 నుంచి 8.30 గంటల వరకు నెలకు రూ.300, కారుకు పార్కింగ్ నెలకు రూ. 1000, ద్విచక్రవాహనానికి రూ. నెలకు రూ. 500 చెల్లించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదం తెలుపుతూ తీర్మానం చేశారు.

సామూహిక కుంకుమార్చన



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



కుంకుమార్చనలో ఉభయదాతలు, భక్తులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని చిట్టినగర్ శ్రీమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన ఉత్సవాలు శుక్రవారం పూర్ణాహుతితో పరిసమాప్తమ్యాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో అమ్మవారి ఉత్సవ మూర్తి వద్ద సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. పలువురు ఉభయదాతలతో పాటు మహిళా భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చండీ హోమం, లక్ష్మీ గణపతి హోమం ఆలయ ప్రధాన అర్చకులు నుదురుమాటి కృష్ణప్రసాద్ శర్మ, సహాయ అర్చకులు రెంటచింతల కాశీ విశ్వనాథశర్మ చేశారు. శ్రావణ మాసం నెల రోజుల పాటు అమ్మవారికి విశేష కుంకుమ పూజలతో పాటు పంచహారతుల సేవ నిర్వహించామన్నారు. పూర్ణాహుతిలో ఆలయ అర్చకులతో పాటు దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగపల్లి అప్పారావు, మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావులతో పాటు ఇతర దేవస్థాన కమిటీ కార్యవర్గ సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. భక్తులకు అమ్మవారి అన్న ప్రసాద వితరణ జరగగా, ఉభయదాతలు, భక్తులు, చిట్టినగర్‌కు చెందిన స్థానికులు ప్రసాదాన్ని స్వీకరించారు. పంచహారతుల సేవ నిర్వహించారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారంటూ ఓ వివాహిత భవానీపురం పోలీసులను ఆశ్రయించింది. విద్యాధరపురం మద్దాల వారి వీధికి చెందిన కోట నాగ వెంకట తులసి కుమారికి 2021లో పసుపర్తి రాజశేఖర్‌తో వివాహం జరిగింది. వివాహ సమయంలో పసుపు, కుంకుమ కింద రూ. 5 లక్షలు, 200 గ్రాముల బంగారు నగలు ఇచ్చారు. కాపురానికి వెళ్లిన తొలిరోజు నుంచే అత్తమామలు వేధింపులు ప్రారంభించారు. బట్టలు, కంచాలు అన్ని వేరుగా ఉంచి భోజనం పెట్టకుండా ఇబ్బందులకు గురి చేశారు. లావుగా ఉన్నావని, కలర్ తక్కువ అని అందరి ముందు అవమానించారు. పరస్పర విడాకుల కోసం కాగితాల మీద సంతకం చేయాలని బలవంతం చేశారు. మరో యువతితో అక్రమ సంబంధం పెట్టుకుని వదిలించుకోవాలని ప్రయత్నించాడు. ఈ ఏడాది జనవరిలో తనపై దాడి చేసి ఇంటి నుంచి గెంటివేశారు. పాస్ట్‌పోర్ట్, సర్టిఫికెట్స్, బంగారం అన్ని వారి వద్దనే ఉంచుకుని మ్యూచువల్ డైవోర్స్‌కి సహకరిస్తేనే అవి ఇస్తామని బెదిరించారు. వేధింపులు తట్టుకోలేక బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

నైట్ డ్యూటీ అలవెన్స్ నిలిపివేతపై నిరసన

వర్క్‌షాప్ వద్ద నల్లబ్యాడ్జిలతో గేట్ మీటింగ్



ఆర్టీసీ వర్క్‌షాప్ వద్ద నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆర్టీసీ ఉద్యోగులకు నైట్ డ్యూటీ అలవెన్స్‌లు, టీఏ, ఇతర డ్యూటీ ఆధారిత అలవెన్స్‌లను జీతాల బిల్లులతో కలిపి ఇవ్వకూడదని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎమ్‌యుఏ) విద్యాధరపురం ఆర్టీసీ వర్క్‌షాప్ వద్ద శుక్రవారం నల్ల బ్యాడ్జిలతో గేట్ మీటింగ్ ద్వారా నిరసన తెలిపింది. ఈ సందర్భంగా విజయవాడ నాన్ ఆపరేషన్ యూనిట్ సెక్రటరీ కల్యాణ్ కుమార్, అధ్యక్షులు నాగేశ్వరరావు, వర్క్‌షాప్ సెక్రటరీ సీహెచ్ శ్రీనివాస్, ప్రెసిడెంట్ స్వామి మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లకు ఈ నెల జీతంలోనే నైట్ అవుట్ అలవెన్స్‌లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఏపీ పీటీడీ ఉద్యోగులపట్ల ట్రెజరీ శాఖ ఉన్నతాధికారుల తీరును నిరసిస్తున్నామని చెప్పారు. రిటైరయిన ఉద్యోగులకు సకాలంలో సెటిల్‌మెంట్ చేయకుండా ట్రెజరీ శాఖ పెడుతున్న తీవ్ర ఇబ్బందులకుతోడు ఇప్పుడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దాదాపు 50 వేల మంది ఉద్యోగుల ప్రయోజనాలు దెబ్బతింటాయని వివరించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం పాలనలో తమ అలవెన్స్‌లు కొన్ని ఏళ్లపాటు పెండింగ్‌లో ఉండేవన్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు అదే పరిస్థితి పునరావృతం అయ్యేలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల గ్రాట్యుటీ, ఆర్జిత సెలవుల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సర్వీస్‌లో చనిపోయిన ఉద్యోగులకు అంత్యక్రియల ఖర్చు రూ.25వేలను ట్రెజరీ ద్వారా ఇప్పించాలన్నారు. ఉద్యోగులు పాల్గొని ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు.

భక్తులందరికీ అన్నప్రసాద వితరణ

ఈవో రామరావు



అన్నప్రసాదంలో పంపిణీ చేస్తున్న ఆహార పదార్థాలు పరిశీలిస్తున్న ఈవో రామరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ జరగాలని, ముఖ్యంగా పండుగలు, పర్వదినాలతో పాటు వారాంతంలో సాధ్యమైనంత మందికి అన్న ప్రసాదం అందించాలని దుర్గగుడి ఈవో కెఎస్.రామరావు ఆలయ అధికారులను ఆదేశించారు. మహామండపం మొదటి , రెండో అంతస్తులలో జరుగుతున్న అమ్మవారి అన్న ప్రసాద వితరణను శుక్రవారం ఈవో కెఎస్.రామరావు పరిశీలించారు. తొలుత మహా మండపం రెండో అంతస్తుకు చేరుకున్న ఈవో అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులతో మాట్లాడారు. అన్న ప్రసాదం తయారీకి వినియోగించే ఆహార పదార్థాల నాణ్యత, ప్రసాద వితరణ చేస్తున్న సిబ్బంది వ్యవహారశైలి గురించి భక్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహా మండపం మొదటి అంతస్తులో బఫే పద్ధతిలో జరుగుతున్న అన్న ప్రసాద వితరణను పరిశీలించారు. అన్న ప్రసాదం పంపిణీపై ఏఈవో చంద్రశేఖర్ ఈవోకు వివరించారు. దేవస్థానం వీలైనంత ఎక్కువ మందికి అన్న ప్రసాదం అందించాలనే సంకల్పంతో ఉందని పేర్కొన్నారు. అన్న ప్రసాద వితరణపై భక్తులు సంతృప్తిని వ్యక్తం చేయడం చాలా ఆనందంగా ఉందని ఈవో పేర్కొన్నారు. మరింత రుచిగా, శుచిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, అన్న ప్రసాదం స్వీకరించిన భక్తుల అభిప్రాయాలను సైతం సూచనల పుస్తకం ద్వారా తెలుసుకోవాలని ఆదేశించారు. సాధారణ రోజుల కంటే శుక్ర, శని, ఆదివారాలు మరంత ఎక్కువ మంది భక్తులకు అన్నప్రసాదం అందించాలని సూచించారు. అన్న ప్రసాదం పంపిణీ పరిశీలించిన క్రమంలో ఆహార పదార్థాల నాణ్యతను ఈవో రామరావు రుచి చూసి పరిశీలించారు. ఏఈవో చంద్రశేఖర్‌తో పాటు అన్నదాన అధికారులు పాల్గొన్నారు.

మొక్కలతో కాలుష్యరహిత సమాజం



38వ డివిజన్‌లో మొక్క నాటుతున్న రెహమతున్నీసా



40వ డివిజన్‌లో మొక్క నాటుతున్న ఆంజనేయరెడ్డి



47వ డివిజన్‌లో మొక్క నాటుతున్న గోదావరి గంగ

భవానీపురం(విజయవాడపశ్చిమ): పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని, భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత సమాజాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని పలువురు కార్పొరేటర్లు పిలుపునిచ్చారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గట్టు వెనుక ప్రాంతంలోని పలు డివిజన్లలో కార్పొరేటర్లు శుక్రవారం మొక్కలను నాటారు. విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలోని పలు ప్రదేశాల్లో స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా మొక్కలను నాటారు. భవానీపురం 40వ డివిజన్ పరిధిలో అనేక చోట్ల కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి, చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ గోదావరి గంగ మొక్కలను నాటి వాటి సంరక్షణపై స్థానికులకు అవగాహన కల్పించారు. పర్యావరణ సమతుల్యతకు మొక్కలను నాటటం ఒక్కటే మార్గమని చెప్పారు. ముఖ్యంగా తల్లిపై ఉన్న ప్రేమ, గౌరవానికి గుర్తుగా ప్రతి ఒక్కరూ 'ఏక్ పేడ్ మా కే నామ్' (అమ్మ కోసం మొక్క) నినాదంతో ఒక మొక్కను నాటి సంరక్షించటం ద్వారా కాలుష్య రహిత వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో 47వ డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకుడు గోదావరి బాబు, ఆయా డివిజన్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సురేంద్ర, రాజ్‌కుమార్, వేణు గోపాలరావు, మలేరియా-1 ఇన్‌స్పెక్టర్ రాంబాబు, సచివాలయ ఉద్యోగులు, ఏఎన్ఎమ్‌లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

యోగాతో రుగ్మతలు మాయం



మాట్లాడుతున్న కల్లూరు రామకృష్ణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ మాతాజీ నిర్మలాదేవి సహజయోగ ట్రస్ట్ ఏపీ శాఖ ఆధ్వర్యంలో సహజయోగ ధ్యానంపై ఈ నెల 31, సెప్టెంబర్ ఒకటో తేదీ రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ట్రస్ట్ ఏపీ కోఆర్డినేటర్ కల్లూరు రామకృష్ణ చెప్పారు. ఏపీ దేవదాయ ధర్మదాయ శాఖ సహకారంతో విజయవాడ సీవీరెడ్డి చారిటీస్ ప్రాంగణంలో ఈ వర్క్‌షాప్ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంతరం సహజయోగ సాధన ద్వారా మనిషి శారీరక, మానసిక రుగ్మతలను మాయం చేసుకోవచ్చని తెలిపారు. సహజయోగ ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇంటింటికీ సహజయోగం వ్యాప్తి కోసం పలు కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. సహజయోగ ప్రక్రియల ద్వారానూ, ధ్యానం చేయటం ద్వారా ప్రతి ఒక్కరూ తమలో వివేకం, విజ్ఞానం, సత్వ గుణాలను పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. స్కిల్స్, నాలెడ్జ్, డిజైర్ లక్ష్యంగా ఈ వర్కుషాపు ఉంటుందన్నారు. ఐటీ రంగంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిపుణులను తయారుచేస్తున్న ఢిల్లీకి చెందిన యోగేష్ అగర్వాల్, కాన్పూర్‌కు చెందిన రాజేష్‌చంద్ర సహజయోగాపై తరగతులు నిర్వహిస్తారని వివరించారు. ట్రస్ట్ దక్షిణ భారత కోఆర్డినేటర్ సుభాషిణి, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సహజయోగ ధ్యాన కేంద్రం వివిధ విభాగాల్లోని ప్రతినిధులు, ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన సహజయోగ ధ్యాన కేంద్రం నిపుణులు హాజరవుతున్నారని వెల్లడించారు. ప్రారంభసభకు రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కేఎస్ రామారావు ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారన్నారు. ట్రస్ట్ రాష్ట్ర కమిటీ సభ్యులు పీవీ రామ్మోహనరావు, మహిళా విభాగం కోఆర్డినేటర్ సుగ్గల సుధారాణి, ఎన్టీఆర్ జిల్లా కోఆర్డినేటర్ యర్రంశెట్టి గాంధీ, విజయవాడ కోఆర్డినేటర్ టి.రవీంద్రబాబు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 19 మందికి జరిమానా

విజయవాడస్పోర్ట్స్: విజయవాడ నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 19 మందికి రైల్వే కోర్టు న్యాయమూర్తి ఆర్.వి.శర్మ శుక్రవారం జరిమానా విధించారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ఒకటో ట్రాఫిక్ పోలీసులు పలు ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో మద్యం తాగి వాహనాలు నడిపిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. నిందితులు ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారు.

బయోసైన్స్‌స్ ద్వారా మరిన్ని అవకాశాలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రసాయనశాస్త్ర విద్యార్థులు బయోసైన్స్‌స్‌పై మరింత పట్టు సాధించటం ద్వారా మరిన్ని అవకాశాలను పొందవచ్చని ఎమినెంట్ బయోసైన్స్‌స్ (ఇండోర్) ప్రిన్సిపాల్ సైంటిస్ డాక్టర్ ఎన్.అనురాజ్ తెలిపారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రీసెంట్ అడ్వాన్స్‌స్ అండ్ అప్లికేషన్స్ ఆఫ్ బయోఇన్నోమెటిక్స్ ఇన్ బయోసైన్సెస్ అంశంపై సదస్సును ఆ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ అనురాజ్ మాట్లాడుతూ వైద్యరంగంలో బయోసైన్సెస్ ఆవిష్కరణలు మానవాళికి విస్తృతమైన ఉపయోగాలను కలిగిస్తున్నాయని చెప్పారు. వ్యాధుల నిర్ధారణ, ఔషధ తయారీ వంటి అంశాల్లో అనేక నూతన అంశాలు ప్రపంచ వ్యాప్తంగా ముందుకు వచ్చాయని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఆయా రంగాల్లో చోటు చేసుకున్న మార్పులు, నూతన అంశాలను తెలుసుకోవాలని సూచించారు. తద్వారా మరింత విజ్ఞానాన్ని పొందటానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రసాయనశాస్త్ర విభాగాధిపతి శైలజ, అధ్యాపకులు డాక్టర్ కిరణ్‌కుమార్, కేపీటీ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.